క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: లోక కల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయ స్వామికి విశేష పూజలను దేవస్థానం ఈఓ, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

పశువులకు గాలికుంటు టీకాలు



పశువులకు గాలికుంటు టీకాలు వేస్తున్న వైద్యాధికారిణి శ్రుతికీర్తి

పగిడ్యాల: పశువులు గాలికుంటు వ్యాధికి గురికాకుండా ముందస్తుగా ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు పశువైద్యాధికారిణి శ్రుతికీర్తి గురువారం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఈ నెలాఖరు వరకు టీకాల కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. వ్యాధి సోకిన పశువుల నోటి నుంచి జొల్లు కారడం, గెట్టల చీలమండలంలో పుండ్లు ఏర్పడి మేత తినకుండా బక్కపడిపోతాయన్నారు. వ్యాధి తీవ్రత అధికంగా ఉంటే పశువులు మృత్యువాత పడే ప్రమాదం ఉందని, పశుపోషకులు ముందు జాగ్రత్తగా టీకాలు వేయించుకోవాలని సూచించారు. టీకా కార్యక్రమంపై గ్రామాల్లో దండోరా వేయించామని, రెండురోజుల్లో 80 పశువులకు టీకాలు వేశామని చెప్పారు.

పౌష్టికాహారంతోనే క్షయవ్యాధి దూరం



క్షయవ్యాధి గ్రస్తులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: పౌష్టికాహారంతోనే క్షయవ్యాధిని దూరం చేయవచ్చని ఆత్మకూరు టీబీ యూనిట్ సూపర్‌వైజర్ రవికుమార్ అన్నారు. గురువారం మండలంలోని గోకవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో డాక్టర్ జూబేద ఆధ్వర్యంలో 39 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు సెంట్రల్ పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ సహకారంతో పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పాలు, గుడ్లు, ఆకుకూరలు, కూరగాయలు, తదితర పోషకాలున్న ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యవంతంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ రాఘవేంద్ర, సీహెచ్ఓ, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో పింఛన్ల పంపిణీ



ముసలిమడుగులో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ చేస్తున్న వలంటీర్లు దాసు

కొత్తపల్లి: జనవరి నెల వైఎస్సార్ పింఛన్ కానుక గురువారం మండలంలో ప్రారంభమైంది. ఈనెల ప్రభుత్వం పెంచిన పింఛన్ రూ.3,000 లను లబ్ధిదారులకు ఎక్కడ ఉంటే అక్కడే గ్రామ వలంటీర్లు వెళ్లి అందజేస్తున్నారు. మండలంలో 4,342 మంది లబ్ధిదారులు ఉన్నారు. ప్రభుత్వం పింఛన్ మొత్తాన్ని పెంచడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న సర్పంచ్

మిడుతూరు: మండల పరిధిలోని కడుమూరు గ్రామంలో కరెమ్మ గుడి నుంచి వాల్మీకి ఆలయం వరకు సీసీ రహదారి నిర్మాణానికి సర్పంచ్ జీవరత్నం గురువారం భూమిపూజ చేశారు. సంబంధిత నిర్మాణ పనులు నాణ్యతాయుతంగా చేపట్టాలని కాంట్రాక్టర్ తువ్వా వెంకట నాగిరెడ్డికి సూచించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ రమేష్, పంచాయతీ కార్యదర్శి కల్యాణ సింగ్, నాయకులు శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు నూతన పింఛన్ల పంపిణీ

మిడుతూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ పర్వత యుగంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి తెలిపారు. గురువారం ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామ సచివాలయల పరిధిలో అర్హులైన 61 మందికి (వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు) నూతన పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. వీరికి ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పింఛన్ అందజేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి సర్పంచులు, ఎంపీటీసీలు, నూతన పింఛన్ లబ్ధిదారులు హాజరు కావాలని కోరారు.

అవ్వాతాతల ఆనందమే జగనన్న ఆశయం

- ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ రూ.3వేలకు పెంపు
- మాట తప్పని జగనన్నను మరోమారు ఆశీర్వదించాలి
- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- లబ్ధిదారులకు పెంచిన, కొత్త పింఛన్ల పంపిణీ



నూతన పింఛన్‌దారులకు నగదు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్, అధికారులు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్, పింఛన్‌దారులు

జూపాడుబంగ్లా: ఇచ్చిన మాటను తప్పకుండా అవ్వాతాతలు, ఒంటరి మహిళలు, దివ్యాంగుల కళ్లల్లో ఆనందం చూడటమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. గురువారం జూపాడుబంగ్లా వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో పెంచిన రూ.3వేల పింఛన్, నూతన పింఛన్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాదయాత్రలో ప్రజల కష్టాలను చూసి చలించిన జగనన్న ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే పింఛన్ల పెంపు ఫైల్‌పై మొదటి సంతకం చేసి సంచలనం సృష్టించారన్నారు. ఇచ్చిన మాట తప్పకుండా పింఛన్ మొత్తాన్ని ప్రతి ఏటా పెంచుతూ ఈ ఏడాది రూ.3వేలకు పెంచినట్లు తెలిపారు. దేశంలో ఒక్క ఏపీలోనే నెలకు రూ.3వేల పింఛన్ ఇస్తున్నట్లు తెలిపారు. టీడీపీ పాలనలో ప్రతి నెల పింఛన్ తీసుకోవాలంటే అవ్వా, తాత, అక్కా, చెల్లెమ్మ, దివ్యాంగులు తిండీతిప్పలు మానుకొని సచివాలయాల వద్ద పడిగాపులు కాయాల్సివచ్చేదన్నారు. జగనన్న సీఎం అయ్యాక ప్రతి నెల ఒకటోవతేదీన తెల్లవారకముందే వలంటీర్లు ఇంటివద్దకు వచ్చి తలుపుతట్టి నగదు అందజేస్తున్నారని చెప్పారు. పార్టీలకు అతీతంగా అన్నివర్గాల వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చేసిన జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు సీఎంగా ఆశీర్వదించాలని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ కోరారు.

34,259 మంది లబ్ధిదారులు

నందికొట్కూరు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు కలిపి 487నూతన పింఛన్లు మంజూరు కాగా మొత్తం పింఛన్లు 34,259 మందికి నెలకు రూ.10,27,77,000 నగదు మంజూరవుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. జూపాడుబంగ్లా మండలానికి కొత్తగా 57 పింఛన్లు మంజూరయ్యారని చెప్పారు. అనంతరం సీఎం చిత్రపటానికి లబ్ధిదారులతో కలిసి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీడీఓ నూర్జహాన్, ఎంపీపీ సువర్ణమ్మ, ఈఓపీఆర్డీ మధుమోహనచక్రవర్తి, సర్పంచు మొట్టిబాలయ్య, తూడిచెర్ల సర్పంచ్ బాల మద్దిలేటి, ఎంపీటీసీ మోతె వెంకటమ్మ, వైఎస్సార్సీపీ నాయకులు జంగాలపెద్దన్న, ఉస్మాన్‌బాషా, దేవసహాయం, శివానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నా పెద్దకొడుకు జగనే మళ్లీ సీఎం కావాలి



నాపెద్దకొడుకు లాంటి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రూ.3వేల పింఛన్ ఇస్తున్నాడు. ఆయనే మళ్లీ సీఎం కావాలి. జగన్ సీఎం అయ్యాక ప్రతి నెలా ఒకటోవ తేదీన తెల్లవారక ముందే పింఛన్ సొమ్ము చేతిలో పెడుతున్నారు. చంద్రబాబు పాలనలో పింఛన్ కోసం పనులు వదులుకొని పంచాయతీ ఆఫీసు వద్ద రెండు, మూడు రోజులు పడిగాపులు కాయాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ బాధల్లేవు. – చంద్రమ్మ, వృద్ధురాలు

చంద్రబాబు హయాంలో అభివృద్ధి శూన్యం

నందికొట్కూరు: చంద్రబాబు హయంలో అభివృద్ధి శూన్యమని ఎమ్మెల్యే తొగరు ఆర్థర్ అన్నారు. గురువారం పాములపాడు మండల పరిధిలోని మద్దూరు గ్రామంలో రెండో విడత గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందాయా? లేదా? ఆరాతీశారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో వడ్డేర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రామసుబ్బయ్య, గోపికృష్ణ, , తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీటీసీ బషీర్ అహ్మద్, మండల కో ఆప్షన్ సభ్యులు ముర్తుజా, సచివాలయ ఉద్యోగులు, వైఎస్సార్‌సీపీ నాయకులు జబ్బార్, రాములమ్మ, మూడియాల రమణారెడ్డి, శివలింగం తదితరులు పాల్గొన్నారు.



మద్దూరులో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి చేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

వివక్ష లేకుండా సంక్షేమ పథకాలు



లబ్ధిదారురాలికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా

- చంద్రబాబు కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దు
- ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- బండిఆత్మకూరులో పింఛన్ల పంపిణీ

ఆత్మకూరు: నిరుపేదలకు వివక్ష లేకుండా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అని స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. గురువారం బండిఆత్మకూరులో పెంచిన, సూచనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు పాదయాత్ర సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌ను రూ.3 వేలకు పెంచి మాట నిలబెట్టుకున్నారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అర్హులైన ప్రతి ఒక్కరికీ కుల, మత, రాజీయాలకు అతీతంగా పింఛన్ అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం కొత్తవారికి కూడా తొలిసారిగా రూ.3 వేల పింఛన్ అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని చెప్పారు

చంద్రబాబు మాటలు నమ్మి మోసపోవద్దు

టీడీపీ అధ్యక్షులు చంద్రబాబు మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని, తప్పుడు హామీలు, తప్పుడు ప్రకటనలు చేస్తూ ప్రజలను మోసం చేయడమే ఆయన నైజం అని ఎమ్మెల్యే శిల్పా అన్నారు. ఎన్నికల ముందు రైతుల రుణమాఫీ, మహిళలు బ్యాంకుల్లో తాకట్టు పెట్టిన బంగారంపై రుణాలు మాఫీ అంటూ ఎన్నో తప్పుడు హామీలు ఇచ్చి అ. ధికారం వచ్చాక ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని గుర్తుచేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, ఎంపీపీ చిన్నసంజీవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటరామిరెడ్డి, వైస్ ఎంపీపీ రమణ, మధురాణి, సింగల్‌విండో చైర్మన్ శివలింగం, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ నాయక్, సర్పంచ్ ఎరుకల సంధ్య, మాజీ సర్పంచ్ సుజాతమ్మ, చిన్నమద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రం ప్రారంభం

రైతుల సంక్షేమమే త మ ప్రభుత్వ ధ్యేయం అని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. మండలంలోని ఈర్నపాడు గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలో డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ చేశారు.

బాధిత కుటుంబాలకు చేయూత

మండలంలోని ఎ.కోడూరు గ్రామానికి చెందిన సంజీవరాయుడు గతేడాది కేసీ కెనాల్లో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. స్థానికులు కుటుంబ పరిస్థితిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన సీఎం సహాయ నిధి నుంచి రూ.2 లక్షలను మంజూరు చేయించారు. ఈ మేరకు బాధితులకు బాధితులకు చెక్కును అందజేశారు. అలాగే ఈర్నపాడు గ్రామానికి చెందిన చిన్నపక్కీరయ్య అనారోగ్యంతో మృతిచెందడంతో వారి కుటుంబసభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

నేడు ఆత్మకూరులో పింఛన్ల పంపిణీ

ఆత్మకూరు పట్టణంలో శుక్రవారం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు పట్టణ, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు సయ్యద్ మీర్, రాజమోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు మినరల్‌వాటర్ ప్లాంట్, సాయంత్రం 5 గంటలకు కురుకుంద గ్రామంలో నూతన సీసీ రోడ్లను ప్రారంభిస్తారని చెప్పారు.

పీఎం జన్‌మన్‌పై చెంచులకు అవగాహన



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ మేరి

కొత్తపల్లి: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పీఎం జన్ మన్ కార్యక్రమంపై మండల పరిధిలోని భ్రమరాంబా గిరిజన గూడెంలో ఎంపీడీఓ మేరి గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కార్యక్రమాన్ని గిరిజనుల అభివృద్ధి కోసం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో గిరిజనులకు సురక్షిత హౌసింగ్, శుభ్రమైన తాగు నీరు, ఆరోగ్య సంరక్షణకు మెరుగైన యాక్సెస్, విద్య, పోషణ, రోడ్లు, టెలికమ్యూనికేషన్స్ కనెక్టివిటీ, జీవనోపాధి అవకాశాలు కల్పిస్తోందన్నారు. అనంతరం పీఎం జన్‌మన్ కరపత్రాలను పంపిణీ చేశారు.కార్యక్రమంలో చెంచు మహిళా సమాఖ్య సీసీ యూసుఫ్, గిరిజనులు పాల్గొన్నారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి

పగిడ్యాల: జగనన్న భూ హక్కు రీ సర్వేపై ఈనెల 6, 9 తేదీలలో నెహ్రూనగర్, పాత ముచ్చుమర్రి గ్రామాల్లో నిర్వహించే గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ భారతి కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ బ్రిటీష్ హయాంలో జరిగిన భూ సర్వే రికార్డులను క్రమబద్ధీకరణ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రీ సర్వేకు శ్రీకారం చుట్టిందన్నారు. అందులో భాగంగా మండలంలోని నెహ్రూనగర్, పాత ముచ్చుమర్రి గ్రామాల్లో జరిగిన రీ సర్వేపై రైతులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా తెలియజేయాలని తెలిపారు. అభ్యంతరాలను ఈనెల 16వ తేదిలోగా స్థానిక గ్రామ సచివాలయాల్లోని వీఆర్వో లేదా తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని వెల్లడించారు. జనవరి 6న నెహ్రూనగర్, 9న పాత ముచ్చుమర్రి గ్రామాల్లోని సచివాలయాల వద్ద గ్రామసభలు ఉంటాయన్నారు.

వేతనాలు త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకుంటాం



ఉపాధి కూలీలలతో మాట్లాడుతున్న అంబుడ్స్‌మెన్ సురేంద్రనాథ్

కొత్తపల్లి: మండలంలోని ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో పనులు చేసిన కూలీలలకు బకాయి వేతనాలను త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకుంటామని అంబుడ్స్ మెన్ సురేంద్రనాథ్ అన్నారు. గురువారం ఏపీఓ రేష్మతో కలసి దుద్యాల గ్రామశివారుల్లోని మునగ సాగును పరిశీలించారు. ముందుగా ఉపాధికూలీలతో ముఖాముఖీ మాట్లాడి సమస్య అడిగి తెలుసుకున్నారు. కూలీలు ఆరు వారాలుగా వేతనాలు అందలేదని తెలిపారు. వాటిని ఉన్నత అధికారులతో చర్చించి వెంటనే వచ్చేలా చూస్తామన్నారు. దినసరి కూలీ రూ.272 వర్తించే విధంగా కూలీలు కొలతల ప్రకారం పనిచేయాలని సూచించారు. మండలంలో సుమారు 60 ఎకరాలలో రైతులు మునగ పంటను సాగుచేసుకున్నారని అందులో 15 ఎకరాలు అకాల వర్షాలకారణంగా పూర్తిగ దెబ్బతిన్నాయన్నారు. రైతులు ఉద్యానవన పంటల సాగు వైపు అడుగులు వేయాలని తెలిపారు.

దీపోత్సవ పండగ వైభవంగా నిర్వహిద్దాం



ఇంటింటికీ అయోధ్య అక్షింతలను పంపిణీ చేస్తున్నభక్తులు

మిడుతూరు: జనవరి 22న అయోధ్య శ్రీ రామ జన్మభూమిలోని నూతన మందిరంలో బాల రాముని నూతన విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ రోజున ప్రతి ఇంట్లో దీపోత్సవ పండగను వైభవంగా నిర్వహిద్దామని విశ్వహిందూ పరిషత్ సభ్యులు డాలు చిట్టిబాబు, రామకృష్ణారెడ్డి, రామోహన్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కన్యకాపరమేశ్వరీ ఆలయం నుంచి విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆయోధ్య అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాలు కృష్ణమూర్తి, శేషాద్రి, అచారి, ఓబులేసు, స్వామన్న తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష క్యాంపులు పకడ్బందీగా నిర్వహించండి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: అన్ని మండలాలలో నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ ఏపీ సెక్రటేరియట్‌లోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి ఆరోగ్యం, వైద్యం – కుటుంబ సంక్షేమం, జగనన్న ఆరోగ్య సురక్ష, స్త్రీ – శిశు సంక్షేమం, అంగన్‌వాడీల పనితీరు, రీసర్వే మూడవ దశ, ఇనామ్–అసైన్డ్ భూములు, కరువు, పీ–ఆర్డీ, ఎన్ఆర్ఈజీఎస్ – కరువు మండలాల్లో వేజ్ జనరేషన్, జల్ జీవన్ మిషన్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ ఛాంబర్ నుంచి కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్ఓ పుల్లయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలందరూ సద్వినియోగం చేసుకొనేలా విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. మూడవ విడతలో చేపట్టిన రీసర్వే పనులను వేగవంతం చేసి స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ సేవలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని చెప్పారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నందికొట్కూరు: మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఏసురత్నం డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు భాస్కర్, పరమేష్, నాగేశ్వరరావు, సర్వర్‌ఖాన్, మారెన్న, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

ఆత్మకూరు: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు జోసఫ్, రాజు, నాగన్న మాట్లాడుతూ తమ న్యాయమైన కోర్కెలు ప్రభుత్వ పరిష్కరించాలని 10 రోజులుగా సమ్మె చేస్తున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలన్నారు.

వేతనాలు పెంచాలి

కొత్తపల్లి: అంగన్‌వాడీలకు వేతనాలు పెంచి గ్రాట్యూటీ అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు హరిత, మండల నాయకురాళ్లు నాగమణి, శ్రీదేవి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు 24వ రోజు సమ్మె నిర్వహించారు. సెల్‌ఫోన్లకు పూజలు చేసి నిరసన వ్యక్తం చేశారు. తమ కోర్కెలు నెరవేర్చేవరకూ పోరాటం ఆగబోదన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం అంగన్‌వాడీ వర్కర్లు నిరసన కార్యక్రమం కొనసాగించారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్స్ యూనియన్ నాయకురాలు మంజుల మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలన్నారు.

గంగన్నకు లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు

నంద్యాల(న్యూటౌన్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును 2023 సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా ఈనెల 3న కాకినాడలో అందజేశారని నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి గంగన్న గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ సామాజిక సేవలను గుర్తించి కాకినాడ ఎంపీ యూత్ వలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు పూలేప్రసాద్, మల్లి ఆధ్వర్యంలో అవార్డు అందుకున్నట్లు చెప్పారు.

లూయిస్ బ్రెయిలీ జయంతి

నంద్యాల(న్యూటౌన్): అంధులు క్రీడల్లోను, చదువు లో ఉన్నత స్థానాల్లో ఉండి ఇతరులకు మార్గదర్శకంగా ఉండాలని నంద్యాల డీఎస్పీ మహేశ్వరరెడ్డి అ న్నారు. గురువారం రామకృష్ణారెడ్డి కళాశాలలోని వివేకానంద ఆడిటోరియంలో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు, స్పందన బ్లైండ్ పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ ప్రసాదరెడ్డి నూతన వస్త్రాలను ఉచితంగా దివ్యాంగులకు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణవేణి,లక్ష్మీకాంతరెడ్డి, అసోసియేషన్ అధ్యక్షులు మస్తాన్‌వలి, మరియదాసు, జహరుద్దీన్ రోట రీ క్లబ్ ప్రెసిడెంట్ దస్తగిరి, లింగారెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



సికిల్‌సెల్ సర్వే వివరాలు తెలుసుకుంటున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ

కొత్తపల్లి: విద్యార్థులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ కాంతారావు నాయక్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. ముందుగా వంటశాల, భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరిశుభ్రతను పాటించాలన్నారు. పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరముందన్నారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతగా, రుచికరంగా వడ్డించాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు.

సికిల్‌సెల్ సర్వే త్వరగా పూర్తిచేయాలి

గిరిజన గూడేల్లో నిర్వహిస్తున్న సికిల్ సెల్ సర్వేను త్వరగా పూర్తిచేయాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ కాంతారావునాయక్ సూచించారు. గురువారం మండలంలోని గువ్వలకుంట్ల సచివాలయం పరిధిలోని పాలెంచెరువు, చదరంపెంట, ఎర్రగుంటగూడెలలో సికిల్‌సెల్ సర్వేను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వైద్యసిబ్బంది త్వరితగతిన సర్వేను పూర్తి చేసి ఈ వ్యాధిబారిన పడినవారిని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి దీపానాగవేణి, సీహెచ్ఓ బాలకృష్ణ, ఏఎన్ఎం సరిత, ఎంఎల్‌హెచ్‌పీ శైలజ పాల్గొన్నారు.

క్రీడా మైదానాల పరిశీలన



ఆత్మకూరులో క్రీడామైదానాన్ని పరిశీలిస్తున్న శిల్పాకార్తీక్‌రెడ్డి

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకర్గం పరిధిలోని ఆత్మకూరు, వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది మండలాల్లో కార్తీక్ ప్రీమియర్ లీగ్ నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణకు గురువారం ఆయా మండలాల్లో క్రీడామైదానాలను వైఎస్సార్ సీపీ నాయకుడు శిల్పా కార్తీక్‌రెడ్డి పరిశీలించారు. ఆత్మకూరు మండలంలోని బాపనంతపురం గ్రామంలో సాధ్య క్రీడామైదానం, వెలుగోడు లోని మోడల్ స్కూల్ క్రీడామైదానం, బండిఆత్మకూరు మండలం ఈర్నపాడు ఏపీ మోడల్‌స్కూల్ మైదానం, మహానందిలోని క్రీడామైదానాలు పరిశీలించారు.

నేటి నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష'

నందికొట్కూరు రూరల్ : మండలంలో శుక్రవారం నుంచి రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శోభారాణి గురువారం తెలిపారు. 5న బిజినవేముల, 12న అల్లూరు, 19న కొణిదేల–1, 27న బొల్లవరం, 30న బ్రాహ్మణకొట్కూరు, ఫిబ్రవరి 6న శాతనకోట, 13న వడ్డెమాను, 20న కోనేటమ్మపల్లి, 27న దామగట్ల, మార్చి 5న మల్యాల, 15న నాగటూరు, 23న కొణిదేల–2వ సచివాలయం పరిధిలో వైద్య శిబిరాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమానికి సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

పడమర ప్రాతకోటలో

పగిడ్యాల: మండలంలోని పడమర ప్రాతకోట గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడుత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ గురువారం తెలిపారు. వైద్య శిబిరానికి జిల్లా కేంద్రం నుంచి స్పెషలిస్టు వైద్యులు వస్తున్నందున ఈ అవకాశాన్ని గ్రామంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహానంది మండలంలో..

ఆత్మకూరు: మహానంది మండలంలో శుక్రవారం నుంచి మార్చి 5వ తేదీ వరకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివనాగజ్యోతి తెలిపారు. ఈ నెల 5న గోపవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో, 9న బొల్లవరం ఎంపీపీ పాఠశాల, 19న మసీదుపురం వైఎస్సార్‌హెల్త్‌క్లినిక్, 23న తమ్మడపల్లి, ఫిబ్రవరి 2న గాజులపల్లె, 6న సీతారామాపురం సచివాలయ పరిధిలో కార్యక్రమం ఉంటుందన్నారు.

బండిఆత్మకూరు మండలంలో..

బండిఆత్మకూరు మండలంలో ఈ నెల 5 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వాసుదేవగుప్త తెలిపారు. ఈ నెల 5న పెద్ద దేవులాపురం, 9న సంతజూటూరు, 19న బి.కోడూరు, 23న బోధనం, ఫిబ్రవరి 16న బండిఆత్మకూరు, 23న చిన్నదేవులాపురం, మార్చి 1న పార్నపల్లె, 5న లింగాపురం, 15న బండిఆత్మకూరు , 22న సింగవరం, ఏప్రిల్ 12న ఈర్నపాడు, 26న కడుమల కాల్వలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు



సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న మున్సిపల్ కో ఆప్షన్‌సభ్యులు రషీద్

ఆత్మకూరు: మున్సిపాలిటీ పరిధిలో మరిన్ని సీసీ రోడ్లు వేయిస్తామని మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు రషీద్ తెలిపారు. పట్టణంలోని రెండో వార్డులో గురువారం రూ.6 లక్షలతో నూతన సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లో నూతన సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియమారూఫ్ ఆధ్వర్యంలో అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్రధానంగా డ్రైనేజీ, వీధి దీపాలు, మంచినీటి సమస్య తదితర వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు విజయచౌదరి, విజయకుమార్, మారబోతుల స్వామి, కలిముల్లా, షఫివుల్లా, లాలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి పలువురు రాజీనామా

శ్రీశైలం టెంపుల్: మండలంలో భారతీయ జనతా పార్టీకి పలువురు రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు రాజీనామా చేశారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దారివేముల శ్రీనివాస్, నంద్యాల జిల్లా కార్యవర్గ సభ్యుడు కేతావత్ రాములు నాయక్, బీజేపీ శ్రీశైలం మండలం ఎస్సీ నాయకులు జెడ్డా వెంకటేశ్వర్లు, కొండేటి రాజు, కాశయ్య, దర్శనం రామయ్య, సుగుణమ్మ తదితరులు గురువారం పార్టీ అధిష్టానానికి రాజీనామా సమర్పించారు.

వ్యక్తిగత కారణాల వలన తాము బీజేపీ పార్టీలో ఉండలేక పోతున్నామని వారు పేర్కొన్నారు.